**Telugu**

# *The Spoken Word*

*by*

*WILLIAM MARRION BRANHAM*

# ప్రతి కాలములో నున్న పరిశుద్ధాత్మ

# (HOLY GHOST IN EVERY AGE)

పలుకబడిన మాటయే మూలవిత్తనం

# ప్రతి కాలములో నున్న పరిశుద్ధాత్మ
# (HOLY GHOST IN EVERY AGE)

ప్రకటన **2:11**. "సంఘములతో ఆత్మ చెప్పుచున్న మాట చెవిగలవాడు వినును గాక!" ఈ వచనము పలుకబడని సంఘ కాలము ఒక్కటి కూడా లేదు. ప్రతి సంఘ కాలములోను ప్రతివారికి ఈ హెచ్చరిక ఇయ్యబడినది. "సంఘములతో ఆత్మ చెప్పుచున్న మాట చెవిగలవాడు వినును గాక." వివిధ కాలములలో ఆత్మ ఏమి చెప్పుచున్నదో దానిని వినుట మనుష్యులందరికిని సాధ్యము కాదని దృఢముగా చెప్పగలము. I కొరింథీ 2:6 – 16. పరిపూర్ణులైన వారి మధ్య జ్ఞానమును బోధించు చున్నాము. అది ఈ లోక జ్ఞానము కాదు. నిరర్థకులై, పోవుచున్న ఈ లోకాధికారుల జ్ఞానమును కాదు గాని దేవుని జ్ఞానము మర్మమైనట్టుగా బోధించుచున్నాము. ఈ జ్ఞానము మరుగైయుండెను. జగదుత్పత్తికి ముందుగానే దీనిని దేవుడు మన మహిమ నిమిత్తము నియమించెను. అది లోకాధికారులలో ఎవనికిని తెలియదు. అది వారికి తెలిసియుండినయెడల మహిమా స్వరూపియగు ప్రభువును సిలువ వేయక పోయి యుందురు. ఇందును గూర్చి – దేవుడు తన్ను ప్రేమించు వారికొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు అని వ్రాయబడియున్నది. మనకైతే దేవుడు వాటిని తన ఆత్మ వలన బయలుపరచియున్నాడు. ఆ ఆత్మ అన్నిటిని, దేవుని మర్మములను కూడా పరిశోధించు చున్నాడు. ఒక మనుష్యుని సంగతులు అతనిలో నున్న మనుష్యాత్మకే గాని మనుష్యులలో మరి ఎవనికి తెలియును? ఆలాగే దేవుని సంగతులు దేవుని ఆత్మకే గాని మరి ఎవనికిని తెలియవు. దేవుని వలన మనకు దయచేయబడిన వాటిని

తెలిసికొనుటకై మనము లౌకికాత్మను కాక దేవునియొద్ద నుండి వచ్చు ఆత్మను పొందియున్నాము. మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో కాక ఆత్మ సంబంధమైన సంగతులను ఆత్మ సంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము. ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు, అవి అతనికి వెర్రితనముగా ఉన్నవి. అవి ఆత్మానుభవము చేతనే వివేచింపదగును గనుక అతడు వాటిని గ్రహింపజాలడు. ఆత్మ సంబంధియైనవాడు అన్నిటిని వివేచించును గాని అతడెవని చేతనైనను వివేచింపబడడు. ప్రభువు మనస్సును ఎరిగి ఆయనకు బోధింపగలవాడెవడు? "మనమైతే క్రీస్తు మనస్సు కలిగినవారము." మత్తయి 13:13-16. ఇందు నిమిత్తము నేను ఉపమాన రీతిగా వారికి బోధించుచున్నాను. ఈ ప్రజలు కన్నులార చూచి, చెవులారా విని హృదయముతో గ్రహించి మనస్సు త్రిప్పుకొని నా వలన స్వస్థత పొందకుండునట్లు వారి హృదయము క్రొవ్వినది, వారి చెవులు వినుటకు మందములైనవి, వారు తమ కన్నులు మూసికొని యున్నారు గనుక మీరు వినుట మట్టుకు విందురు గాని గ్రహింపనే గ్రహింపరు, చూచుట మట్టుకు చూతురు గాని ఎంత మాత్రమును తెలిసికొనరు అని యెషయా చెప్పిన ప్రవచనము వీరి విషయమై నెరవేరుచున్నది. అయితే మీ కన్నులు చూచుచున్నవి గనుక అవి ధన్యములైనవి. మీ చెవులు వినుచున్నవి గనుక అవి ధన్యములైనవి. యోహాను 8:42-44. "యేసు వారితో ఇట్లనెను - దేవుడు మీ తండ్రియైన యెడల మీరు నన్ను ప్రేమింతురు. నేను దేవునియొద్ద నుండి బయలుదేరి వచ్చియున్నాను, నా అంతట నేనే వచ్చియుండలేదు, ఆయన నన్ను పంపెను. మీరేల నా మాటలు గ్రహింపకున్నారు? మీరు నా బోధ విననేరకుండుట వలననే గదా? మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు, మీ తండ్రి దురాశలు నెరవేర్చగోరుచున్నారు. ఆది నుండి వాడు నరహంతకుడై యుండి సత్యమందు నిలిచినవాడు కాడు. వానియందు సత్యమే లేదు. వాడు అబద్ధ మాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును. వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునై యున్నాడు." ఏ మనుష్యుడును తనకు తానుగా దేవుని మాట వినజాలడని ఈ లేఖనముల వలన అర్థమగుచున్నది. దేవుని ద్వారానే అతనికి ఆ సామర్థ్యము అనుగ్రహింపబడవలయును. మత్తయి 16:17. అందుకు యేసు - సీమోను బర్‌యోనా. నీవు ధన్యుడవు, పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే గాని నరులు నీకు బయలుపరచలేదు. ఈ వచనములను ఒక చోటికి

మనము చేర్చినపుడు ఒకేఒక గుంపు ప్రజలున్నారని మనము చూడగలము. వారు ఒక ప్రత్యేకమగు గుంపు ప్రజలు. ప్రతి కాలములోను ఆత్మ ఏమి చెప్పుచున్నదో దానిని వారు వినగలుగుదురు. ప్రతి కాలముయొక్క ప్రత్యక్షతను ఆ ప్రత్యేకమగు జనులు గ్రైకొనెదరు. ఆ గుంపు దేవునికి చెందియున్నది, ఎందుకనగా దేవునియొక్క మాటను వినలేని గుంపు దేవునికి చెందినది కాదు. (యోహాను 8:24-44) ఆత్మ చెప్పుచున్న దానిని విని, స్వీకరించు గుంపు ప్రత్యక్షతను పొందిన గుంపు. ఆ గుంపును గూర్చి వివరించబడినది. I కొరింథీ 2:6-16. దేవునియొక్క ఆత్మను కలిగియున్న వారు వారే. దేవుని మూలముగా జన్మించిన వారు వారే. వారు ప్రభువైన యేసుక్రీస్తు యొక్క శరీరములోనికి బాప్తీస్మమును ఆయన ఆత్మ ద్వారా పొందియున్నారు. వారు పరిశుద్ధాత్మచే బాప్తిస్మము పొందియున్నారు.

ఇప్పుడు మనము చెప్పుకొనిన దానిని ఇంకా వివరించుకొనవలెనన్నచో మరియొక లేఖనమును మనస్సులో నుంచుకొని పరిశుద్ధాత్మతో ఎవరు బాప్తిస్మము పొందెదరా అని మనము చర్చించుచుండగా. యోహాను 6:45లో యేసు ఏమి చెప్పెనో చూడండి. "వారందరును దేవుని చేత బోధింపబడుదురు అని ప్రవక్తల లేఖనములలో వ్రాయబడి యున్నది గనుక తండ్రి వలన విని నేర్చుకొనిన ప్రతివాడును నా యొద్దకు వచ్చును." కాని యెషయా 54:13 చూడండి. దానిని తీసి ఈలాగు చదువుదురు. "నీ పిల్లలందరు యెహోవా చేత ఉపదేశము పొందుదురు." దేవుని వారందరును దేవునియొక్క పిల్లలే. కావున ఇది దేవునియొక్క నిజమైన బిడ్డయనుటకు రుజువు, (అతని మీదికి ఆత్మ వచ్చి మరి లోపల నివసించును) వాక్యమును వారు పరిశుద్ధాత్మ ద్వారా బోధింపబడి మరల స్థిరపడుచున్నారు.

పరిశుద్ధాత్మతో బాప్తిస్మము పొందియుండుటకు సూచనగా ఈ భాషలు ఎందుకు లేవో ఇప్పుడు మీరు చూచుటకు ప్రారంభింపవచ్చును. ఏ కాలములోను ఈ విధంగా చెప్పబడలేదు. "భాషగలవాడు మాత్రమే ఆత్మ చెప్పుచున్న దానిని చెప్పును గాక!" అందువలన భాషలు, అర్థము చెప్పుట, ప్రవచనము మొదలగునవి సూచనగా యున్నవనుటను దూరముగా ఉంచుచున్నది. ఆత్మ ఏమి చెప్పుచున్నదో దానిని **వినుటయే** సూచనయై యున్నది. ఆత్మ మాట్లాడుచున్నది. అవును ఆత్మ ఉపదేశించు చున్నది. తాను వచ్చినప్పుడు అదే చేయుదునని యేసు ఖచ్చితంగా చెప్పెను. యోహాను 14:26. పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని

మీకు జ్ఞాపకము చేయును. అదియే మరి ఖచ్చితముగా జరిగినది. సువార్తలు ఆ విధముగానే వ్రాయబడినవి. యేసు చెప్పిన మాటలను వీరు పరిశుద్ధాత్మ ద్వారా జ్ఞాపకమునకు తెచ్చుకొనిరి. ఆ కారణము చేతనే సువార్తలు బహు ఖచ్చితముగా యున్నవి. అవి పరిపూర్ణముగా యున్నవి. వారి మనస్సులకు ఆ సంగతులన్నింటినీ ఆత్మ జ్ఞాపకమునకు తెచ్చుట మాత్రమే కాదు గాని, మరి వారు కలిగియున్న సత్యమును గురించి మరింత విశదముగా ఆయన వారికి బోధించెను. పౌలు ఆ విధముగానే ప్రత్యక్షతలను పొందెను. దానిని గూర్చి అతడు చెప్పెను. "నేను బోధించిన సువార్త మనుష్యుల మూలముగా పొందినది కాదని సోదరులారా మీకు ధృవపరచుచున్నాను. నేను దానిని మానవుల వలన పొందను లేదు. ఎక్కడను నేర్చుకొనలేదు. (మానవుల ద్వారా) యేసు క్రీస్తుయొక్క ప్రత్యక్షత వలన పొందితిని." గలతీ 1:11-12. పరిశుద్ధాత్మ వలన అతడు బోధింపబడెను.

యేసు భూమి మీద ఉండినప్పుడు ఒక దినమున ఒక గొప్ప ప్రముఖ వ్యక్తి ఆయనను దర్శింప వచ్చెను. అతడు ఇట్లనెను, "రబ్బీ! నీవు దేవుని వలన పంపబడిన బోధకునివని మేము ఎరుగుదుము." అయితే మీరు గమనించినయెడల యేసు అతనిని అధికముగా మాటలాడనియ్యలేదు. నికోదేము వైపు ఆయన తిరిగి, ఆయన చెప్పిన మాటలను ఈ విధంగా మనము తిరిగి చెప్పుకొనవచ్చును. "నేను బోధకునిని కాను. నేను పాపము కొరకు అర్పించబడు బలి గొర్రెపిల్లను. నా ఆత్మ ద్వారా క్రొత్త జన్మను సాధ్యపరచుచున్నాను. కాని బోధకుడు ఒకాయన రాబోవుచున్నాడు. ఆయనే పరిశుద్ధాత్మ." యేసు భూమి మీద ఉండగా గొర్రెపిల్లవలె, మరియు ప్రవక్తగాను వచ్చెను. కాని ఆయన సంఘము యొద్దకు తన ఆత్మ ద్వారా తిరిగి వచ్చినప్పుడు ఆయన బోధకుడుగా మారెను.

ప్రతి కాలములోను అదే సత్యమును మనము వినుచున్నాము. "సంఘములతో ఆత్మ చెప్పుచున్న మాటను చెవి గలవాడు వినును గాక!" కాని ఆ కాలమునకు సంబంధించిన ప్రత్యక్షతను ఆత్మ నింపుదల కలిగిన వ్యక్తి మాత్రమే వినగలడు. మరెవరును వినలేరు. లేదయ్యా వారెందుకు వినలేరో పౌలు I కొరింథీ 2:6-16లో స్పష్టముగా చెప్పెను.

ఇది మీకు ఆనందమును కలుగజేయవలసి యున్నది. ఒక చాలా వింతయగు బోధ ఇప్పుడు చాలా ఎక్కువగా వినబడుచున్నది. దానివలన చాలా అపార్థము మరియు

కఠినమగు భావము ఏర్పడుచున్నది. నీవు **తప్పకుండా** భాషలు మాట్లాడవలెనని పెంతెకోస్తువారు చెప్పుదురు, లేనియెడల పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందలేదని వారందురు. నాక్సు, మూడీ, టేలర్, గోఫోర్తు మొదలగు మహా భక్తులు పరిశుద్ధాత్మను పొందియుండుటను వారు నిరాకరించుచున్నారు అనుకోవచ్చును. లేదా వారందరూ రహస్యముగా భాషలు మాట్లాడిరని ఏమి జరుగుచున్నదోయని ఎరుగకయుండిరని అయినా చెప్పుచున్నారనుకోవచ్చును. జరుగుచున్న దానిగూర్చి వారికి తెలియదు. అది సత్యము కాదు. అది పూర్తిగా తప్పు. లేదయ్యా అది పూర్తిగా తప్పు. ఆత్మ నింపుదల కలిగియుండుటకు సూచనగా భాషలు లేవు. అది కేవలము తొమ్మిది ఆత్మ వరములలో ఒక్కటి మాత్రమే. దానిని I కొరింథీ 12లో చూడగలరు. భాషలు మాట్లాడుట ద్వారా నీవు పరిశుద్ధాత్మ పొందియున్నావని ఎక్కడనూ వాక్యము చెప్పుట లేదు. భాషలు మాట్లాడుట ద్వారా నీవు పరిశుద్ధాత్మను పొందెదవని కూడా ఎక్కడా చెప్పబడలేదు. వారందరూ పరిశుద్ధాత్మతో నింపబడిన తరువాత భాషలు మాట్లాడిరని చెప్పబడియున్నది. ఆ తరువాత కొంచెము క్రింద వారు ప్రవచించిరని అక్కడ చెప్పబడి యున్నది.

భాషలు మాట్లాడుట ద్వారా పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందియున్నారని నమ్ముచున్నవారందరూ తాము మాట్లాడుచున్నది నిజమగు భాషేయని తలంచు చున్నారు. ఈ రోజున చాలామంది మధ్య ఈ భావము నెలకొనియున్నది. కాని ఇది నిజము కాదు. ఎందుకనగా అనేకులు తప్పు ఆత్మయొక్క ప్రభావము వలన తెలిసిన భాషలు మాట్లాడుచున్నారు. మనము ఒక కూటములో ఉన్నామనుకొందము. వచ్చిన వారందరూ భాషలు మాట్లాడుచున్నారు అనుకొనండి. ఏ భాష దేవుని ఆత్మవలన వచ్చినదో, ఏ భాష అపవాది వలన వచ్చినదో మీరెట్లు తెలిసికొనగలరు? నేను అన్యుల మధ్య యున్నాను. వారియొక్క మంత్రగాళ్ళు పుర్రెలో రక్తము పోసికొని త్రాగి, భాషలలో మాట్లాడగా, మరికొందరు దానికి అర్థము చెప్పుట, ప్రవచించుట నేను చూచాను. వారు భాషలలో వ్రాయగలరుకూడాను. పరిశుద్ధాత్మను పొందియున్నట్లుగా భాషలు సూచన అయినట్లయితే ఆ మాట్లాడిన వారందరి భాషలును దేవునికి చెందినవిగా నుండవలయును. అయితే భాషలే రుజువన్న జనులు నిజమైన మరియు అబద్ధములైన భాషలున్నవని ఒప్పుకొనియున్నారు ఏలయనగా దేవుడు స్వచ్ఛమైనవి కలిగియున్నాడు మరి సాతాను అబద్ధమైన వాటిని కలిగియున్నాడు. కాబట్టి నా ప్రశ్న ఇది: “ఏది నిజమో ఎవరికి తెలియును?” ఆ మాట్లాడినది భాషలని

ఎవరికి అర్థమగును? దానిని తెలిసికొను వివేచన వరము ఎవరికున్నది? ఈ జవాబులును మనము పొందవలెనన్నచో ఇంకా ముందుకు వెళ్ళి మనము పరిశీలించవలెను. అంత వరకూ ఈ భాషలకు మూలమేదో మనము ఆశ్చర్యపడక తప్పదు. ఏమి చెప్పబడియున్నదో తెలియక మీరు గనుక భాషలు రుజువన్న కార్యమును బలపరచినయెడల మీరిక్కడ ఇప్పుడే చూడవచ్చును. భాషలన్నియును దేవునివేయను స్థిర నిర్ణయమునకు రావలసియున్నారు. అప్పుడు మీరు అపవాది వలన భాషలు మాట్లాడుట జరుగదని చెప్పినట్లగును. కాని అది ఆ విధముగా కాదు, కాదు. ఒక్క నిమిషము కూడా దానిని సత్యముగా నిరూపించలేరు. విదేశములలో మిషనెరీగా యున్నవానికి ఈ నిజము తెలియును. అపవాది కూడా అన్య భాషలలో మాట్లాడగలదని వారెరుగుదురు. నా అనుభవము ద్వారా దానిని నేను ఎరుగుదును.

పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందినప్పుడు జనులు భాషలలో మాట్లాడెదరని నిర్ధారించు వాక్యము ఎక్కడనూ లేదని పెంతెకోస్తు పండితులు కూడా ఒప్పుకొందురు. అపోస్తలుల కార్యములలో ఐదు సందర్భములలో మూడు మార్లు జనులు అన్య భాషలలో మాట్లాడిరి. ఆ అనుభవమును బట్టి వారు దానిని భావించిరని వారు ఒప్పుకొనుచున్నారు. లేఖనములు లేకయే రెండు రకముల భాషలున్నవని కూడా వారు చెప్పెదరు. ఒకటేమో నీవు పరిశుద్ధాత్మను పొందినప్పుడు మాటలాడెదవు. అది 'రుజవు' ఆ తరువాత నీవు నమ్మినయెడల భాషల వరమును పొందెదవని వారందురు. దానిని నీవు తరచుగా మాట్లాడుదువని అందురు. పరిశుద్ధాత్మను పొందినట్లు సూచనగా నీవు ఒక్కసారి భాషను మాట్లాడిన తరువాత మరెన్నడూ దానిని మాట్లాడవని వారందురు. మరొకమారు ఇది వాక్యములో ఎక్కడ యున్నదని తెలిసికొనుటకు మనము ఆతృతతో యున్నాము. అది వాక్యములో లేనియెడల దానిని దేవుడు పలుక లేదు. వాక్యమునకు దేనినయినా చేర్చువానికి అయ్యో. వారు పూర్తిగా నిర్లక్ష్యము చేయుచున్న ఈ ముఖ్యమైన అంశమును గురించి వాక్యములో చెప్పబడి యున్నది. I కొరింథీ 13. మనుష్యులయొక్కయు, దేవదూతలయొక్కయు భాషల గూర్చి అక్కడ చెప్పబడినది. ఇవి తెలిసిన, తెలియని భాషలు. ఈ ఆధునిక పెంతెకోస్తు వారు తెలియని లేక దేవదూతల భాషలలో మాట్లాడినప్పుడు వారు పరిశుద్ధాత్మను పొందెదమని చెప్పుచున్నారు. వారికి గుఱ్ఱముకంటె ముందు బండియున్నది. ఎందుకనగా అపోస్తలుల కార్యములు 2వ అధ్యాయములో జనులు ఒక పరిపూర్ణమగు

భాషను మాట్లాడిరని యున్నది, దానిని అవిశ్వాసులు సహితము విని అర్థము చేసికొనిరని చెప్పబడియున్నది.

దేవుడు మౌనముగా యున్నపుడు మనమును మౌనముగా యుండుట మంచిది. ఆయన ఎక్కడ మాట్లాడెనో అక్కడ మనము కూడా మాట్లాడుట ఆయన ఇంతకుముందు చెప్పినదానినే మనము చెప్పుట మంచిది. ఆయన మనకు సూచనను చెప్పెను. పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందిన తరువాత ఏమి జరుగునో ఆయన చెప్పెను. మనయొద్దకు బోధకుడు వచ్చి సర్వ సత్యమును బోధించును. కాని ఆ బోధకుడు అంతరంగమందుండు ఉపదేశకుడు, బయటి ఉపదేశకుడు కాడు. అంతరంగమందు ఆత్మ లేనియెడల నీవు సత్యమును వినజాలవు. దానిని నీవు ప్రత్యక్షత ద్వారా పొందలేవు. నీవు దానిని దినములోని ప్రతి క్షణము కూడా వింటూ యుండవచ్చును. పౌలు దినములలో అంతరంగమందు నివసించు ఆత్మయొక్క సూచన అదే. పరిశుద్ధాత్మతో నింపబడినవారు వాక్యమును వినిరి. దానిని చేర్చుకొనిరి. దాని ద్వారానే జీవించిరి. ఆత్మను పొందలేని వారు కేవలము శరీరసంబంధులు వినినట్లుగానే విని దానికి వారు తప్పు వ్యాఖ్యానము చెప్పి మరి పాపము లోనికి వెళ్ళిరి.

ప్రతి కాలములోను సూచన ఒకే మాదిరిగానే యున్నది. (నిజ విశ్వాసికి ప్రతి కాలము కూడా పరిశుద్ధాత్మ కాలమువలెనె యుండును) – ఆత్మను కలిగియున్న వారు, అనగా ఉపదేశకుని కలిగియున్న వారు వాక్యమును వినిరి. వారిలో యుండిన ఆత్మ వాక్యమును స్వీకరించెను. దానిని నేర్పించెను. (దానిని బయలుపరచెను) వారు ఆ వర్తమానికుని వినిన గుంపుగా యున్నారు. వారు ఆ వర్తమానమును విని దానివలన జీవించిరి.

పెంతెకోస్తు దినమును మరియు కొర్నేలి ఇంటిలో పరిశుద్ధాత్మ మరి అప్పుడు ఆ రెండు ఒకే విధమైన అనుభవములు పరిశుద్ధాత్మయొక్క బాప్తీస్మమునకు రుజువుగా నున్నదని చూచుటకు మరల వెనుదిరిగి ఆ కార్యములను చూచులాగున ఇదొక గొప్ప ప్రేరేపణయని నేను ఎరిగియున్నాను. కాని ఆ రెండు సందర్భములలోను వారు మాట్లాడిన భాషలు వినిన వారికి అర్థమయినవి. ఈ నవీన బబులోను గందర గోళమువలెనున్న పెంతెకోస్తు కూటములకు ఆనాడు పలికిన భాషల కేకలకు చాలా

దూరముగా నున్నవి. అటువంటి తర్కమును విడిచిపెట్టుటకు ఈ రుజువులు చాలును. వాటివలన ఒప్పించబడుదుము. మనము ఒక వాస్తవమును ఎదుర్కొనవలసి యున్నామని గుర్తు చేయుచున్నాను. ఎన్నడూ భాషలలో మాట్లాడని వారు, తమ జీవితములలో ఆ మిగిలిన ఎనిమిది ప్రత్యక్షతలను లేదా వాటిలో కొన్నింటిని కలిగియుండవచ్చును. జ్ఞానపు మాట, ఆత్మలయొక్క వివేచన, బుద్ధి వాక్యము, విశ్వాసము, స్వస్థత మరియు అద్భుతములు అను వరములు ఉన్నవి. తొమ్మిది వరములలోను భాషలు మాట్లాడుట అను వరము చాలా అల్పమైనదని మీరు ఎరిగినప్పుడు ఇంకా మీకు ఆశ్చర్యము కలుగును. ఈ విషయమును దృష్టిలో ఉంచుకొనండి. కాబట్టి మనము భాషలలో ఎన్నడూ మాట్లాడనివారిని చూచు చుందుము. వారు భాషలలో మాట్లాడు వారికన్నను ఇంకా గొప్ప వరములను ఉపయోగించుచున్నారు. కాబట్టి ఈ బోధను మనము ఇంతకు ముందుకంటె మరి సంపూర్తిగా కొట్టివేయవలెను.

ఇప్పుడు మీరు దీనిని చూచియున్నారు. బైబిలు చెప్పనిదానిని మనము చెప్పకూడదు. ఆ ఆశీర్వదించబడిన వ్యక్తియొక్క ప్రత్యక్షత ప్రతియొక్క కాలపు సత్యమును, ఆ కాలపు సత్యమైన సంతానమునకు తీసికొని వెళ్ళుటయే పరిశుద్ధాత్మ యొక్క క్రియయని లేఖనములు మనకు బోధించుచుండగా, పిదప ఆ ఆత్మ ఆ వ్యక్తిలో నివసించుచున్నదని మనము ఎరిగియున్నాము. లేనియెడల ఆ సమయమునకైన సత్యమును అతను గైకొనలేడు. ఆమేన్. ఇది పూర్తిగా నిజము. మరియు ఈ కాలములన్నియును దేనినైనను తీసికొని వచ్చినయెడల, అవి నిశ్చయముగా ఈ సత్యమును మోసికొని మరి తీసికొని వచ్చును.

ఇప్పుడు ఈ అంశమును విడిచిపెట్టు ముందుగా, వాక్యానుసారముగా పరిశుద్ధాత్మయొక్క బాప్తిస్మమనగా ఏమిటో తేటగా లేఖనముల ప్రకారము చెప్పగోరు చున్నాను. నా ఉద్దేశ్యము ప్రకారము కాదు. మీ ఉద్దేశ్యము ప్రకారము కాదు. యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు" ప్రకారము అది యుండవలెను. లేనియెడల మనము తప్పుగా నడిపింపబడియున్నాము. ఆమేన్.

ప్రారంభింపవలయుననిన మీరు గమనించెదరు. నా కూటములలో నేను సువార్త కూటమును ఆపిన తరువాత, అనగా బోధించిన తరువాత లేదా ఒక

వర్తమానము అందించిన తరువాత నేను వలను విసిరి, జనుల నుండి స్పందనను ఆహ్వానించుదును. వారిని ముందుకు రమ్మని పిలచి పరిశుద్ధాత్మను పొందుడని చెప్పెదను. నా పెంతెకోస్తు స్నేహితులు దీనిని విని నేను జనులను పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందునట్లు ఆహ్వానించుచున్నానని అనుకొందురు. ఎందుకనగా వారంతక ముందే తిరిగి జన్మించిరి. ఆత్మను పొందుటకు రమ్మని ఇచ్చిన నా ఆహ్వానమును అందుకొని ముందుకు వచ్చిన వారితో మాట్లాడి సలహాలిచ్చుటకు పరిశుద్ధాత్మ పొందిన కొందరిని నేను రమ్మని చెప్పెదను. ఈ ప్రియులు ముందుకు వచ్చెదరు. ఈ జనులను వారు దేవునికి లోబడమని చెప్పెదరు. ఆ తరువాత భాషలలో మాట్లాడమని ఒత్తిడి చేయుదురు. ఇందువలన గొప్ప గందరగోళము ఏర్పడుచున్నది. నా భావము ఏమిటో సరిగ్గా నేను చెప్పుచున్నాను. తిరిగి జన్మించుటకు పాపిని ముందుకు రమ్మని నేను అడుగుచున్నాను. అదే పరిశుద్ధాత్మ ద్వారా క్రీస్తుయొక్క శరీరములోనికి బాప్తిస్మము పొందుటయై యున్నది. పెంతెకోస్తు దినమున వాస్తవంగా ఆదే జరిగెను. సంఘము ఆవిర్భవించెను. మరో విధంగా చెప్పవలెనన్నచో ఆత్మ మూలముగా జన్మించుట అనగా, నిజంగా పరిశుద్ధాత్మతో బాప్తిస్మము పొందుటయై యున్నది. ఆ రెండునూ ఒక్కటే.

ఇక్కడ కొంతసేపు ఇది గందరగోళమును కలిగించునని నాకు తెలియును. నేను బాప్టిస్టు బోధకునిగా అభిషేకించబడితినని చాలామందికి తెలియును. దానిని ఆ బాప్టిస్టువారు పోగొట్టుకొనిరని నేను జాగ్రత్తగా చూచి చెప్పుచున్నాను. నీవు నమ్మినప్పుడు పరిశుద్ధాత్మను పొందెదవని వారందురు. కాని అది నిజము కాదు. నీవు విశ్వసించినప్పటి నుండి ఆయనను చేర్చుకొనియున్నావు. అపో.కా. 19:2-6. మీరు విశ్వాసించినపుడు పరిశుద్ధాత్మను పొందితిరా? అని వారినడుగగా వారు - పరిశుద్ధాత్ముడున్నాడన్న సంగతియే మేము వినలేదని చెప్పిరి. అప్పుడతడు - ఆలాగైతే మీరు దేనినిబట్టి బాప్తిస్మము పొందితిరని అడుగగా వారు - యోహాను బాప్తిస్మమును బట్టియే అని చెప్పిరి. అందుకు పౌలు - యోహాను తన వెనుక వచ్చు వానియందు అనగా యేసునందు విశ్వాసముంచవలెనని ప్రజలతో చెప్పుచు మారు మనస్సు విషయమైన బాప్తిస్మమిచ్చెనని చెప్పెను. వారు ఆ మాటలు విని ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందిరి. తరువాత పౌలు వారి మీద చేతులుంచగా పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చెను. అప్పుడు వారు భాషలతో మాటలాడుటకును ప్రవచించుటకును మొదలుపెట్టిరి. ఇక్కడ పౌలు అడిగిన దానిని వినండి. "**అప్పటి నుండి** మీరు

పొందితిరా, మీరు నమ్మినప్పుడు కాదు?" చాలా గొప్ప తేడాయున్నది. మనము విశ్వాసించిన తరువాత పొందుదుము. ఎఫెసీ 1:13లో అపో.కా. 19 ప్రకారము ఎఫెసులో జరిగిన దానిని తిరిగి చెప్పియున్నాడు. మీరును సత్య వాక్యమును అనగా మీ రక్షణ సువార్తను విని క్రీస్తునందు విశ్వాసముంచి వాగ్దానము చేయబడిన ఆత్మచేత ముద్రింపబడితిరి. (మీరు విశ్వాసముంచినపుడు కాదు) ఇక్కడ నా అంశమున్నది. చాలా ఎక్కువమంది మన అధునికులు మరియు మౌలికవాదులు కూడా (నామకార్థులు) రక్షణను ఒక ప్రత్యేక సమయమునకు నమ్ముదురు. చాలా సందర్భములలో దానిని తీర్మానము చేసికొనుట అందురు. దానిని క్రీస్తును చేర్చుకొనుట లేదా తిరిగి జన్మించుట అందురు. క్రీస్తును చేర్చుకొనుట అనగా ఆయనాత్మను చేర్చుకొనుటయే. ఆయన ఆత్మను చేర్చుకొనుట అనగా తిరిగి జన్మించుటయే. ఆయన ఆత్మను చేర్చుకొనుట అనగా పరిశుద్ధాత్మలో బాప్తీస్మము పొందుట. ఆమేన్. ఈ జనులు విశ్వాసించిరి. అది చాలా అద్భుతము. కాని వారు అక్కడే అగిపోయిరి. విశ్వాసించిన తరువాతనే మీరు పరిశుద్ధాత్మను పొందుదురు. ఎల్లప్పుడునూ అదే విధానము. ఇక ముందుకును ఆ విధంగానే యుండును. జనులకు మొదటిసారి పెంతెకోస్తుయొద్ద పేతురు ద్వారా ఇవ్వబడిన నడిపింపు అదియే. "మారు మనస్సు పొంది మీలో ప్రతివాడును పాప క్షమాపణ నిమిత్తము యేసు క్రీస్తు నామములో బాప్తిస్మము పొందవలెను. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందెదరు. ఈ వాగ్దానము మీకును, మీ పిల్లలకును, దూరస్తులందరికిని, ప్రభువగు మన దేవుడు పిలచిన వారికందరికిని చెందును."

పేతురుయొద్దనుండి ప్రత్యక్ష జవాబుగా ఈ మార్గదర్శక సూత్రములు వచ్చినవి. పెంతెకోస్తుయొద్ద వాస్తవంగా జరిగినదానికి ఇది సంబంధము కలిగియున్నది. యోవేలు ద్వారా దేవుడు పలికినది నెరవేరెను. సర్వ శరీరుల మీదను వాగ్దానము చేయబడిన పరిశుద్ధాత్మ కుమ్మరించబడెను. ఆ సమయమునకు ముందు ఆయన కుమ్మరించబడలేదు లేదా అనుగ్రహించబడలేదు. ఇది అదే. కాని అది ఇప్పుడు మారుమనస్సు పొందుట ద్వారా రావలసియున్నది. ప్రభువైన యేసు క్రీస్తు నామములో బాప్తిస్మము పొందవలెను. అప్పుడు దేవుడు తన పనిని చేయ బద్ధుడై యున్నాడు. వచ్చిన వారిని ఆయన నింపును. "మీరు తప్పక తిరిగి జన్మించవలెను. ఆ తరువాత పరిశుద్ధాత్మచే నింపబడుదురు" అని పేతురు గాని, మరే అపోస్తలుడు గాని ఎన్నడూ చెప్పలేదు.

పరిశుద్ధాత్మను పొందుటకు సంబంధించిన అనుభవమునకు ఇది ఒక మాదిరిగా యున్నది. జాగ్రత్తగా గమనించండి. జనుల మీద ఆ మరుసటిసారి పరిశుద్ధాత్మ దిగిన సందర్భమును చూడండి. అపో. కా. 8:5-17. అప్పుడు ఫిలిప్పు సమరయ పట్టణము వరకును వెళ్ళి క్రీస్తును వారికి ప్రకటించుచుండెను. జన సమూహములు విని ఫిలిప్పు చేసిన సూచక క్రియలను చూచినందున అతడు చెప్పిన మాటలయందు ఏక మనస్సుతో లక్ష్యముంచగా, అనేకులను పట్టిన అపవిత్రాత్మలు పెద్ద కేకలు వేసి వారిని వదలిపోయెను. పక్ష వాయువుగలవారును, కుంటివారును అనేకులు స్వస్థతపొందిరి. అందుకు ఆ పట్టణములో మిగుల సంతోషము కలిగెను. సీమోనను ఒక మనుష్యుడు లోగడ ఆ పట్టణములో గారడీ చేయుచూ తానెవడో ఒక గొప్పవాడని చెప్పుకొనుచు సమరయ జనులను విభ్రాంతిపరచుచుండెను. కొద్దివాడు మొదలుకొని గొప్పవాని మట్టుకు అందరు దేవుని మహా శక్తియనబడిన వాడు ఇతడే అని చెప్పుకొనుచు అతని లక్ష్యపెట్టిరి. అతడు బహు కాలము గారడీలు చేయుచు వారిని విభ్రాంతిపరచినందున వారతని లక్ష్యపెట్టిరి. అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసు క్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించు చుండగా వారతని నమ్మి పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందిరి. అప్పుడు సీమోను కూడా నమ్మి బాప్తిస్మము పొంది ఫిలిప్పును ఎడబాయకుండి సూచక క్రియలును, గొప్ప అద్భుతములును జరుగుట చూచి విభ్రాంతినొందెను. సమరయ వారు దేవుని వాక్యము అంగీకరించిరని యెరూషలేములోని అపోస్తలులు విని పేతురును, యోహానును వారియొద్దకు పంపిరి. వీరు వచ్చి వారు పరిశుద్ధాత్మను పొందవలెనని వారికొరకు ప్రార్థన చేసిరి. (అంతకు ముందు వారిలో ఎవని మీదను ఆయన దిగియుండలేదు. వారు ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము మాత్రము పొందియుండిరి) అప్పుడు పేతురును, యోహానును వారి మీద చేతులుంచగా వారు పరిశుద్ధాత్మను పొందిరి. 12వ వచనము ప్రకారము వారు వాక్యమును నమ్మిరి. ఆ తరువాత వారు ప్రభువైన యేసు నామములో బాప్తిస్మము పొందిరి. కాని 16వ వచనము ప్రకారము వారు అవన్నియూ చేసినా గాని ఇంకా వారు పరిశుద్ధాత్మను పొందలేదు. విశ్వాసించిన తరువాత, బాప్తిస్మము సరైన రీతిగా పొందిన తరువాత మాత్రమే వారు పరిశుద్ధాత్మ పొందుకొనిరి. అపో. కా 2:38-39లో పేతురు ద్వారా స్థిరపరచబడిన సరియైన మాదిరి అదే.

దీనిని గూర్చి అద్భుతమగు వివేచన అనుగ్రహించు మరియొక లేఖనమున్నది. అది గలతీ 3:13-14లో యున్నది. ఆత్మను గూర్చిన వాగ్దానము విశ్వాసము వలన

మనకు లభించినట్లు అబ్రాహాము పొందిన ఆశీర్వచనము క్రీస్తు యేసు ద్వారా అన్య జనులకు కలుగుటకై క్రీస్తు మనకోసము శాపమై మనలను ధర్మ శాస్త్రముయొక్క శాపమునుండి విమోచించెను. ఇందును గూర్చి - మ్రాను మీద వ్రేలాడిన ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది. అబ్రహాముయొక్క ఆశీర్వచనము నూతన జన్మ అనియు, ఆత్మయొక్క వాగ్దానము పరిశుద్ధాత్మ యొక్కయు బాప్తిస్మము అనియు అనగా ఆ రెండును విడివిడి సంఘటనలని ఏ విధముగాను మనము చెప్పలేము. ఎందుకనగా వాక్యములో ఈలాగున యున్నది. “యేసు సిలువపైన మరణించి యున్నాడు, మరి ఆ మరణము మరియు పునరుత్థానము వలన అబ్రాహాముయొక్క ఆశీర్వాదము యూదులను వదిలి అన్యజనుల పైకి వచ్చెను. అన్య జనులకు ఆ ఆత్మ లభించునట్లుగా ఇది సంభవించెను.”

నేను ఇప్పుడేమి చెప్పినానని అర్థము చేసికొనవలయునన్న ఏల ఏ సమయములోనైనను పౌలు చెప్పినదానిని పేద విద్యార్థులు కనుగొనలేక పోయినారనుటను తేటపరచుచున్నది. పౌలు ఎక్కడా కూడా తిరిగి జన్మించిన తరువాత పరిశుద్ధాత్మచే నింపబడుడి అని చెప్పలేదు. కాని వారు తమ స్వంత అర్థములను ఆ విషయములో చెప్పుచున్నారు. కాని లేఖనములు ఆ విధముగా చెప్పుట లేదు. యేసు కూడా ఎన్నడును ఆ విధముగా చెప్పలేదు. యోహాను 7:37-39 చూడండి. అర్థము చేసికొనుచూ ఇప్పుడు దానిని చదువుడి. “ఆ పండుగలో మహా దినమైన అంత్య దినమున యేసు నిలచి - ఎవడైనను దప్పిగొనినయెడల నాయొద్దకు వచ్చి దప్పి తీర్చుకొనవలెను. నాయందు విశ్వాసముంచువాడెవడో లేఖనము చెప్పినట్టు వాని కడుపులో నుండి జీవ జలనదులు పారునని బిగ్గరగా చెప్పెను. (తనయందు విశ్వాసముంచువారు పొందబోవు ఆత్మను గూర్చి ఆయన ఈ మాట చెప్పెను. యేసు ఇంకను మహిమపరచబడలేదు గనుక ఆత్మ ఇంకను అనుగ్రహింపబడి యుండలేదు.”)

విశ్వాసి యేసు యొద్దకు వచ్చి విశ్వాసము ద్వారా దప్పి తీర్చుకొనుట ద్వారా అతని కడుపులో నుండి జీవజల నదులు పారునని ఇక్కడ ప్రత్యేకముగాను, గట్టిగాను నొక్కి చెప్పబడియున్నది. పెంతెకోస్తుయొద్ద ఈ అనుభవమును చూడగలము. ఈ ఆలోచనను మనము మనస్సులో యంచుకొని యోహాను 4:10 & 14

చదువుదము. "అందుకు యేసు నీవు దేవుని వరమును – నాకు దాహమున కిమ్మని నిన్ను అడుగుచున్నవాడెవడో అదియు ఎరిగియుంటే నీవు ఆయనను అడుగుదువు. ఆయన నీకు జీవజలమిచ్చునని ఆమెతో చెప్పెను. నేనిచ్చు నీళ్ళు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు నేను వానికిచ్చు నీళ్ళు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను." ఇదే జీవజలమును గూర్చి ఇక్కడ చెప్పబడినది. కాని ఈసారి ఇక్కడ నదిగా చెప్పబడలేదు. బావిగా, చెప్పబడినది. జనులు అక్కడే తప్పు చేయుచున్నారు. ఆత్మద్వారా అనుగ్రహింపబడు నిత్య జీవము గూర్చి ఒక చోట చెప్పబడినదనియు, మరియొక చోట నదిగా దానిని గూర్చి చెప్పబడినది గనుక అది శక్తియొక్క సంచకరువుగా ఇయ్యబడిన ఆత్మయైయుండుననియు వారందురు. (ఒక గొప్ప మహాశక్తి ఇమిడియున్నది) ఆలాగు కాదు. అవి రెండును ఒక్కటే అయి యున్నవి. జీవమును మరియు శక్తిని ఇచ్చునది ఆత్మయే. పెంతెకోస్తు యొద్ద అది వచ్చెను.

ఈ అపార్థమునకు కారణము ఏమిటి? జవాబు ఏమనగా "అనుభవమే." మనము అనుభవము ద్వారా వెళ్ళుచున్నాము గాని వాక్యము ద్వారా కాదు. నీ అనుభవమును కొలబద్దగా నీవు చూచుకొనవద్దు. ఒకేఒక మట్టపు గుండు, ఒకేఒక కొలకర్ర యున్నది. అదియే వాక్యము. ఇప్పుడు జాగ్రత్తగా గమనించి దీనిని గ్రహించుడి. పేతురు ఇట్లు చెప్పెను, "ప్రతివాడును మారు మనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము యేసు క్రీస్తు నామములో బాప్తిస్మము పొందుడి. అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు." పౌలు కూడా అదే అడిగెను, "విశ్వాసించినప్పటి నుండి మీరు పరిశుద్ధాత్మను పొందితిరా?" అనడిగెను. ఇక్కడే మనయొక్క సమస్య ఉత్పన్నమవుతున్నది. జనులు తమ పాపముల విషయమై పశ్చాత్తాపపడుచున్నారు. వారు నీటిలో బాప్తిస్మము పొందుచున్నారు. కాని వారు ముందుకు వెళ్ళి పరిశుద్ధాత్మను పొందుట లేదు. ఆ ఆత్మను పొందుటకుగాను మీరు విశ్వాసించుడి. యేసును విశ్వాసించుట అనగా పరిశుద్ధాత్మను పొందుటకు వేయు మంచి అడుగు అని గ్రహించవలెను. కాని జనులు అక్కడే ఆగిపోవుచున్నారు. వారు నీటి బాప్తిస్మము వరకు వచ్చి ఆగిపోవుచున్నారు. వారు నమ్మి ఆగిపోవుచున్నారు. మీరు నమ్మినప్పుడు పొందుదురని బైబిలు చెప్పుట లేదు. మీరు విశ్వాసించినప్పటి నుండి పరిశుద్ధాత్మను పొందియున్నారా? అనడిగెను. దానికి సరియైన, అక్షరాలా అర్థము ఇట్లున్నది: ఇంతకు ముందే మీరు నమ్మియున్నారు గదా? పరిశుద్ధాత్మను

పొందియున్నారా? జనులు నమ్మి ఆగిపోవుచున్నారు. మారు మనస్సు పొందినప్పుడు, ఆయనను విశ్వాసించినప్పుడు మీరు పరిశుద్ధాత్మను పొందుట లేదు. ఇంకా ముందుకు వెళ్ళి మీరు పరిశుద్ధాత్మను పొందవలెను. దానిని మీరు చూచుచున్నారా? మన మౌలికవాదులతో వచ్చిన పొరపాటు అదియే. వారికి శక్తి లేదు. ఎందుకనగా వారు పెంతెకోస్తుయొద్దకు వెళ్ళకుండానే ఆగిపోవుచున్నారు.

వారు ఇశ్రాయేలీయులవలెనె యున్నారు. వారు ఐగుప్తు నుండి బయటకు వచ్చియున్నారు. కాని వాగ్దాన దేశమునకు చేరువలో ఆగిపోయి యున్నారు. ఆ ఇశ్రాయేలీయులు రెండు మిలియనుల జనాంగముతో ఐగుప్తులో నుండి బయలుదేరిరి. వారందరు కలిసి ప్రయాణము చేసిరి. అందరూ ఆ దేవునియొక్క అద్భుత కార్యములను చూచిరి. అందరూ ఆ మన్నాను పంచుకొనిరి, అందరూ ఆ బండలోని నీరు త్రాగిరి. రాత్రియందు అగ్నిస్తంభమును, పగటియందు మేఘమును వారు వెంబడించిరి. కాని కేవలము ఇద్దరు వాగ్దాన దేశమును చేరుకొనిరి. ఇద్దరు మాత్రమే నిజమగు విశ్వాస వీరులుగా యుండిరి. ఇది నిజము. మిగిలినవారందరూ అవిశ్వాసమువలన చనిపోయిరని వాక్యము చెప్పుచున్నది. వారు అవిశ్వాసము వలన చనిపోయిరని వాక్యము చెప్పుచున్నది. వారు అవిశ్వాసము వలననే అందులో ప్రవేశించలేకపోయిరి. (హెబ్రీ 3:19) ఆ కారణము వలననే కేవలము ఇద్దరే ప్రవేశించిరి. మిగిలినవారందరూ విశ్వాసులు కారు. ఈ భేదము ఎందువలన వచ్చియున్నది? ఇద్దరు మాత్రము వాక్యముతో నిలచియుండిరి. కాదేషు బర్నెయా (Kadesh Barnea) యొద్ద ఆ పదిమంది గూఢచారుల గుండెలు బ్రద్దలయిపోయినపుడు యెహోషువా మరియు కాలేబులు ఏ మాత్రమూ చలించలేదు. ఎందుకనగా వారు దేవుని వాక్యమును నమ్మిరి. "మనము ఆ దేశమును స్వాధీనపరచుకొందుము. మనకు శక్తి చాలును" అనిరి. వారికి ఆ శక్తి ఉన్నట్లు గ్రహించిరి. ఎందుకనగా దేవుడు ఇట్లు చెప్పెను, "మీకు నేను ఆ దేశమును ఇచ్చియున్నాను." ఆ ఇశ్రాయేలీయులందరు దేవునియొక్క శక్తిని, మంచితనమును మరియు విమోచనను చూచిన తరువాత కూడా విశ్రాంతిలో ప్రవేశింపలేకపోయిరి. అది పరిశుద్ధాత్మకు మాదిరిగా యున్నది. కాబట్టి దేవునియొక్క ఆత్మను అంగీకరించుటకు మార్గమును పూర్తిగా నమ్మువారు చాలా కొద్దిమంది మాత్రమే యుందురని ఇప్పుడు మీరు గ్రహించగలరు.

సరి, ఇంతవరకు మనము వచ్చియున్నాము. ఇప్పుడు ఇంకా ముందుకు వెళ్ళవలెనని నేను కోరుచున్నాను. ఆ విధముగా నేను చేసినప్పుడు కొన్ని భావోద్రేకములను నేను రేపుదునని నాకు తెలియును. కాని అందుకు నేను బాధ్యుడను కాను. నేను దేవునికిని, ఆయనయొక్క వాక్యమునకును నేను ఏ ప్రజల యొద్దకు దేవుని ద్వారా పంపబడితినో ఆ ప్రజలకును బాధ్యుడనై యున్నాను. ఆయన నాకు చెప్పమనిన దానంతటిలోను నేను నమ్మకస్తుడనై యుండవలెను.

యోహాను 6:37&44లో ఇట్లు చెప్పబడెను, "తండ్రి నాకు అనుగ్రహించిన వారందరును నాయొద్దకు వత్తురు. నా యొద్దకు వచ్చు వానిని నేనెంత మాత్రమును బయటకి త్రోసివేయను. నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనే గాని యెవడును నాయొద్దకు రాలేడు. అంత్య దినమున వానిని నేను లేపుదును." యోహాను 1:12-13. తన్ను ఎందరంగీకరించిరో వారికందరికి, అనగా తన నామమునందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలగుటకు ఆయన అధికారము అనుగ్రహించెను. వారు **దేవుని వలన పుట్టిన వారే** గాని రక్తమువలననైనను శరీరేచ్ఛవలననైనను మనుష్యేచ్ఛవలననైనను పుట్టినవారు కారు. ఎఫెసీ 1:4-5. ఎట్లనగా తన ప్రియుని యందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు తన చిత్త ప్రకారమైన దయా సంకల్పము చొప్పున యేసు క్రీస్తుద్వారా తనకు కుమారులనుగా స్వీకరించుటకై మనలను ముందుగా తనకోసము నిర్ణయించుకొని మనము తనయెదుట పరిశుద్ధులమును నిర్దోషులమునై యుండవలెనని జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమచేత క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను. దేవునియొక్క సార్వభౌమత్వము అను అంశములో మరీ ఎక్కువగా విలీనమగుట లేదు. (ఎందుకనగా దానిగూర్చి చెప్పినచో అదే ఒక గ్రంథమగును) కాని ఈ వచనములను బట్టి ఇక్కడ నేను గుర్తించి చెప్పుచున్నాను. యేసు క్రీస్తు తన స్వంత పెండ్లి కుమార్తెను ఎన్నుకొను చున్నాడు. ఈనాడు మనుష్యులు తమ పెండ్లి కుమార్తెలను ఏ విధముగా ఎన్నుకొను చున్నారో ఆ విధముగా ఈ ఎన్నిక యున్నది. ఒక ప్రత్యేక పురుషుని తన భర్తగా స్వీకరించుదునని పెండ్లి కుమార్తె ఈనాడు అలక్ష్యముగా తీర్మానించుకొనదు. కాదయ్యా! పెండ్లి కుమారుడు నిర్ణయించుకొనును, ఒక ప్రత్యేక స్త్రీని తన పెండ్లి కుమార్తెగా అతడు ఎన్నుకొనును. (యోహాను 15:16. "మీరు నన్ను ఏర్పరచుకొనలేదు గాని నేనే మిమ్మును ఏర్పరచుకొని యున్నాను.") ఇప్పుడు దేవునియొక్క వాక్యము ప్రకారము

భూమికి పునాది వేయబడక ముందే పెండ్లి కుమార్తె ఎన్నుకొనబడెను. ఈ పెండ్లి కుమార్తెను ఎన్నుకొనుట ఆయన చిత్తమును బట్టి జరిగెను. ఎఫెసీ 1:9 మరియు రోమా 9:11లో ఇట్లు వ్రాయబడియున్నది, "ఏర్పాటును అనుసరించిన దేవుని సంకల్పము నిలచును." మరే ఇతర విధముగా మీరు దానిని చదువలేరు. ఇది హృదయ సంకల్పము. దేవునియొక్క నిత్య ఉద్దేశ్యము. ఆయన తన స్వంత ఎన్నిక ద్వారా పెండ్లి కుమార్తెను తీసికొనవలయునని, ఆ సంకల్పము ఆయనలో యుండెను. ఆయనదే. మరియు ఆయన నిత్యముగా నున్నందువలన జగత్తు పునాది వేయబడక మునుపే అది నిర్ణయించబడెను.

ఇప్పుడు దీనిని జాగ్రత్తగా గమనించి చూడండి. నక్షత్ర ధూళి అనునది లేక పూర్వమే. దేవుడు దేవునిగా ఉండక పూర్వమే. (దేవుడనగా ఆరాధనకు పాత్రుడు. ఆయనను ఆరాధించుటకు అప్పుడు ఎవరును లేరు. ఆ సమయములో ఆయన దేవునిగా నుండుటకు సాధ్యునిగా నుండెను.) మరియు ఆయన నిత్య ఆత్మగా ఎరుగబడి యుండెను. ఆయనయొక్క మనస్సులో ఇదివరకే పెండ్లి కుమార్తె యుండెను. అప్పుడే ఆమె ఆయన మనస్సులో యుండెను. ఆయనయొక్క ఆలోచనలలో ఆమె యుండెను. ఈ దేవునియొక్క ఆలోచనల మాట ఏమిటి? అవి నిత్యములు. కావా?

దేవునియొక్క నిత్య ఆలోచనలు! ''దేవునియొక్క ఆలోచనలు నిత్యమైనవా?" అని నేనడగుచున్నాను. మీరు దీనిని అర్థము చేసికొనినయెడల చాలా సంగతులను అర్థము చేసికొనగలరు. సారములోను మరియు ప్రవర్తనలోను రెండింటిలోనూ దేవుడు మారనివాడైయున్నాడు. దానిని మనము అధ్యయనము చేసికొని ఇంతకు ముందే రుజువుపరచియున్నాము. దేవుడు తనయొక్క శక్తులలో అనంతుడు. కాబట్టి దేవుడగు ఆయన సర్వజ్ఞాని. ఆయన సర్వజ్ఞాని గనుక నేర్చుకొన వలసినది ఆయనకేదియూ ఉండదు. ఆయన తనకుతానే ఆలోచన కూడా చేయడు, చేయనవసరము లేదు. ఆయన ఏ సమయములో కూడా తన జ్ఞానమునకు ఏమియూ చేర్చడు. ఆయన తన జ్ఞానమునకు ఏదయినా సమకూర్చుకొనిన యెడల ఆయన సర్వజ్ఞాని కాకపోవును. ఆయన ఒకప్పుడు ఆ విధముగా నుండునని శ్రేష్ఠముగా మనము చెప్పుకొనవచ్చును. అయితే అది లేఖన ప్రకారము లేదు. ఆయన సర్వజ్ఞానియై యున్నాడు. దేనివి గూర్చియు ఆయనకెన్నడునూ క్రొత్త ఆలోచన రాదు. ఎందుకనగా ఆయన ఆలోచనలలో భూత భవిష్యత్ వర్తమాన కాలములకు చెందినదంతయూ

ఉండును. ఆది నుండి అంతము వరకు ఆయనకు తెలియును. ఎందుకనగా ఆయన దేవుడై యున్నాడు. **ఆ విధంగా దేవునియొక్క ఆలోచనలు నిత్యములైయున్నవి. అవి వాస్తవమైనవి.** అవి ఒక సామాన్య మానవుని ఆలోచనలవలె లేవు. మానవుడు తాను గీసిన నమూనాను ఒక దినమున నిజ స్వరూపముగా మార్చును. కాని దేవునికయితే అవి ముందే యున్నవి. అవి దేవునిలో ఒక భాగములై నిత్యముగా యున్నవి.

ఇదెట్లు పనిచేయునో చూడండి. దేవుడు ఆదాము పట్ల ఎన్నో ఆలోచనలను సదా కలిగియుండెను. ఆయన తలంపులలో యుండిన ఆదాము ఇంకా వ్యక్తపరచబడనే లేదు. కీర్తనలు 139:15-16, చూచినట్లయితే మీకు దీనిని గూర్చి కొద్దిగా అవగాహన ఏర్పడును. "నేను రహస్యమందు పుట్టిన నాడు భూమియొక్క అగాధ స్థలములో విచిత్రముగా నిర్మింపబడిన నాడు నాకు కలిగిన ఎముకలును నీకు మరుగైయుండలేదు. నేను పిండమునై యుండగా నీ కన్నులు నన్ను చూచెను. నియమింపబడిన దినములలో ఒకటైన కాక మునుపే నా దినములన్నియు నీ గ్రంథములో లిఖితములాయెను." నేను చెప్పినట్లుగా ఆదాము గూర్చి అది వ్రాయబడలేదు. అయితే మీకు అది కొంత గ్రహింపును ఇచ్చును. ఆయన మనస్సులో ఏ తలంపు కలిగియుండెనో ఆ తెలివిని ఆయన దయచేయును. ఆ ఆలోచన నిత్యమైనది. అది బయలుపరచబడవలసి యున్నది. కావున నేలమట్టితో ఆదాము రూపింపబడెను. అతనియొక్క ఆత్మ సంబంధమగు వ్యక్తిత్వము దేవునిద్వారా సృజింపబడెను. ఆలాగున ఆదాము వ్యక్తపరచబడిన దేవునియొక్క ఆలోచనగా మారెను. ఆ నిత్య ఆలోచనలు ఇప్పుడు బయలుపరచబడినవి.

ఎన్నో శతాబ్దముల వెనుకకు మనము వెళ్ళగలము. మోషేను, ఇర్మియాను, బాప్తిస్మమిచ్చు యోహాను మరి వీరిలో ప్రతియొక్కరిని మనము కనుగొనిన, ఆ యా కాలములలో వ్యక్తపరచబడిన దేవునియొక్క ఆలోచనలుగా వీరున్నారు. ఇప్పుడు మనము యేసు యొద్దకు వచ్చుదము. అనగా **లోగోస్** (LOGOS). ఆయన వ్యక్తపరచబడిన పరిపూర్ణమగు సంపూర్ణమగు ఆలోచనగా యుండెను, ఆయన వాక్యముగా తెలియపరచబడెను. ఆయన వర్తమాన, భవిష్యత్ కాలములలో ఆలాగే అయి యున్నాడు.

జగత్తు పునాది వేయబడక ముందే ఆయనలో (యేసు) మనలను ఏర్పరచుకొనెనని చెప్పబడినది. దానియొక్క అర్థము ఏమనగా అప్పుడే ఆయనతో

కూడా అక్కడ మనం ఉన్నాము. జగత్తు పునాదికి ముందే దేవునియొక్క ఆలోచనలలోను, మనస్సులోను మనము ఉన్నాము. ఏర్పరచబడిన వారికియున్న స్వభావమును గూర్చి అది చెప్పుచున్నది. దానినుండి మీరు దూరము కాజాలరు.

ఇక్కడ ఒక ఆలోచనను నన్ను చెప్పనీయండి. మనయొక్క ఈ ప్రకృతి సంబంధమగు జన్మకూడా ఎన్నిక మీదనే ఆధారపడియున్నది. స్త్రీయొక్క అండాశయములో ఎన్నో గ్రుడ్లు ఉత్పత్తియగును. కాని ఒక నిర్ణయింపబడిన కాలములో, నిర్ణయింపబడిన ఒక గ్రుడ్డు మాత్రమే ఎందుకు క్రిందికి వచ్చును? ఇంకొకటి ఎందుకని రాదు? ఆలాగునే పురుష వీర్యములోని ఒక జీవి మాత్రమే ఆ గ్రుడ్డుకు విలీనమగును. దీనికి ఏ ప్రత్యేక కారణము ఎవరికిని తెలియదు. మిగిలినవి కూడా అంతే తేలికగా విలీనము కావచ్చును. అందుకు తగిన మంచి అవకాశములున్నవి. అయినాగాని ఆలాగున జరుగక అవి నశించును. దీనంతటి వెనుక ఒక గొప్ప జ్ఞానము పనిచేయు చున్నది. లేనియెడల ఆ పిండమును బాలునిగా లేదా బాలికగా నిర్ణయించునది ఎవరు? నలుపు లేదా తెలుపు రంగును, కండ్లయొక్క వైవిధ్యము, ఇంకా ఇతరములగు వాటిని ఎవరు నిర్ణయించుచున్నారు? ఈ ఆలోచనలను మనస్సులో యుంచుకొని యెహోషువా మరియు కాలేబుల గూర్చి ఆలోచించండి. యోహాను 6:49లో యేసు చెప్పలేదా? "మీ పితరులు అరణ్యములో మన్నాను తినియు చనిపోయిరి గదా?" ఆ చనిపోయిన పితరులు ఈ బ్రదికియున్నవారికి తండ్రులు. వారితో ఆయన మాట్లాడు చున్నాడు. వారు నశించిపోయిరి. అయినా గాని యెహోషువా మరియు కాలేబులు ఆత్మ సంబంధముగా ఎన్నికలో నున్నట్లు దేవునియొక్క ఎన్నికలో ప్రకృతిగా వారు యుండిరి.

కాని ముందుకు సాగిపోవలెను. ఈ ఎన్నిక కాబడినవారు దేవునియొక్క ఆలోచనలో యుండుట మాత్రమే కాదు గాని ఆ ఎన్నిక కాబడిన వారిని మరియొక పేరుతో పిలచుట కూడా జరిగినది. వారు వారికి నిర్ణయించిన కాలములో శరీరమందు బయలుపరచబడవలసి యున్నారు. రోమా 4:16. ఈ హేతువుచేతను ఆ వాగ్దానము యావత్తు సంతతికి, అనగా ధర్మశాస్త్రముగలవారికి మాత్రము కాక అబ్రాహామునకున్నట్టి విశ్వాసముగలవారికికూడ దృఢము కావలెనని, కృప ననుసరించినదై యుండునట్లు, అది విశ్వాసమూలమైనదాయెను. రోమా 9:7-13. అబ్రాహాము సంతానమైనంత మాత్రము చేత అందరును పిల్లలు కారు గాని ఇస్సాకు

వల్లనైనది నీ సంతానము అనబడును. అనగా శరీర సంబంధులైన పిల్లలు దేవుని పిల్లలు కారు గాని వాగ్దాన సంబంధులైన పిల్లలు సంతానమని యెంచబడుదురు. వాగ్దాన రూపమైన వాక్యమిదే. మీదటికి ఈ సమయమునకు వచ్చెదను. అప్పుడు శారాకు కుమారుడు కలుగును. అంతే కాదు. రిబ్కా మన తండ్రియైన ఇస్సాకు అను ఒకనివలన గర్భవతియైనప్పుడు, ఏర్పాటును అనుసరించిన దేవుని సంకల్పము, క్రియల మూలముగా కాక పిలుచువాని మూలముగానే నిలుకడగా ఉండు నిమిత్తము, పిల్లలింక పుట్టి మేలైనను కీడైనను చేయక ముందే, పెద్దవాడు చిన్నవానికి దాసుడగును అని ఆమెతో చెప్పబడెను. ఇందును గూర్చి నేను యాకోబును ప్రేమించితిని, ఏశావును ద్వేషించితినని వ్రాయబడియున్నది. గలతీ 3:16. అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను. ఆయన అనేకులను గూర్చి అన్నట్టు – సంతానములకును అని చెప్పక ఒకనిగూర్చి అన్నట్టే – నీ సంతానమునకును అనెను. ఆ సంతానము క్రీస్తు. గలతీ 3:29. మీరు క్రీస్తు సంబంధులైతే ఆ పక్షమందు అబ్రాహాముయొక్క సంతానమైయుండి వాగ్దాన ప్రకారము వారసులైయున్నారు. రోమా 4:16 ప్రకారము అబ్రాహాముయొక్క సంతానమంతటికి దేవుడు ఒక నిశ్చయమగు వాగ్దానమును ఇచ్చెను. ఆ హోదా క్రిందికి పౌలు తనను మరియు విశ్వాసులందరిని తీసికొనివచ్చెను. ఎందుకనగా "అబ్రాహాము మనందరికి తండ్రి అని చెప్పబడెను." ఆ తరువాత అతడు తన నిర్వచనమును క్షీణింప చేయలేదుగాని దానికి తుది రూప మిచ్చెను. గలతీ 3లో యేసుతో కూడా ఆ సంతానము (ఏక వచనము) గుర్తించబడినట్లు చెప్పెను. ఆ సంతానమును వాగ్దాన సంతానముగా ఆయన లెక్కించెను. ఈ వాగ్దానము ఎన్నిక లేదా "దేవునియొక్క ఏర్పాటుతో" కూడియున్నది. మనము దానినే ఖచ్చితంగా చెప్పుచున్నాము. రాజ సంతానముగా నున్న వీరు దేవుని వలన ఏర్పరచబడిన వారు. వారు ముందుగా నిర్ణయింపబడిన వారు. దేవుని చేత ముందుగా ఎరుగబడిన వారు. దేవునియొక్క మనస్సులోను, ఆయనయొక్క ఆలోచనలలోను వారుండిరి. క్రీస్తుయొక్క నిజమగు పెండ్లి కుమార్తె దేవునియొక్క మనస్సులో నిత్యముగా ఉండెనని సామాన్య భాషలో చెప్పవచ్చును. అయితే అందరూ ఒక్కసారే వ్యక్తపరచబడలేదు. ఒక్కొక్కరు వారివారి నిర్ణయ కాలములలో వచ్చుచున్నారు. వారి రుతువును బట్టి వచ్చుచున్నారు. ప్రతి సభ్యుడును వచ్చినప్పుడు అది బయలుపరచబడి మరి శరీరములో తన స్థానమును తీసికొనుచున్నది. ఆ విధముగా ఈ పెండ్లి కుమార్తె అక్షరాలా **పలుకబడిన వాక్య**

**పెండ్లి కుమార్తె సంతానమై** యున్నది. ఆమె అని స్త్రీ లింగమును మనము అపాదించు చున్నప్పటికి ఆమె క్రీస్తు శరీరముగా పిలువబడినది. ఆ విధముగా ఆమె పిలువబడుట సరియేనని మీరు గ్రహించవచ్చును. ఎందుకనగా ఆమె ఆయనలో ముందుగా నిర్ణయించబడినది. అదే మూలమునుండి ఆమె వచ్చియున్నది. ఆయనతో కూడా నిత్యమూ ఉండును. అనేకమంది సభ్యులున్న ఆయన శరీరములో ఇప్పుడామె దేవునిని బయలుపరచుచున్నది. ఒకప్పుడు దేవుడు ఒకే సభ్యునియందు ప్రత్యక్షమాయెను. ఆయనే ప్రభువైన యేసు క్రీస్తు.

ఇప్పుడిచ్చట మనము ఒక ముగింపునకు వచ్చుచున్నాము. నిత్యుడగు లోగోస్ (దేవుడు) కుమారునియందు ప్రత్యక్షమాయెను. దేవత్వముయొక్క సర్వ పరిపూర్ణత శరీరరీత్యా యేసునందు నివసించెను, మరియు ఆ నిత్యుడగు ఆయన, తండ్రియై శరీరమందు ప్రత్యక్షమాయెను. ఆ విధముగా ఆయన కుమారుడను బిరుదును పొందెను. మనము కూడా ఆలాగునే యున్నాము. ఆయనయొక్క నిత్య ఆలోచనలో మనమున్నాము. మన కాలము వచ్చెను. అప్పుడు మనముకూడా పలుకబడిన వాక్య సంతానములో భాగమై యున్నాము. శరీరమందు బయలుపరచబడి యున్నాము. ఆ నిత్యమగు ఆలోచనలు ఇప్పుడు శరీరమును ధరించినవి. ఇప్పుడు దేవుని కుమారుల మయినాము, మనము ఆలాగున పిలువబడి యున్నాము. **పునర్జన్మ వలన మనము సంతానముగా మారలేదు. మనమే సంతానమై యున్నాము. కావున తిరిగి జన్మించి యున్నాము. ఏర్పరచబడిన వారు మాత్రమే తిరిగి జన్మించగలరు.** మనము సంతానము అయి యున్నాము. ఆ కారణము చేతనే మనము లేపబడుదుము. సంతానము కానియెడల తిరిగి లేచుట యుండదు.

దీనిని జాగ్రత్తగా మనస్సులో పదిలపరచుకొనుడి. ఇప్పుడు మరో అడుగు వేయండి. విమోచన అనగా తిరిగి కొనుట. అది యజమాని యొద్దకు వచ్చును. దేవుడు తన మరణము ద్వారా, తన రక్తమును చిందించి మనలను తన స్వకీయులనుగా తిరిగికొనెను. పలుకబడిన వాక్య సంతానమగు పెండ్లి కుమార్తెను ఆయన తిరిగి కొనెను. "నా గొర్రెలు నా స్వరము (వాక్యము) వినును. అవి నన్ను వెంబడించును." మీరు ఎల్లప్పుడును గొర్రెలుగానే యున్నారు. మీరు ఎన్నడును ఒక పందిగా గాని లేదా ఒక కుక్కగా గాని యుండి గొర్రెగా మారలేదు. అది అసాధ్యము.

ఎందుకనగా ఏ జాతిది తిరిగి ఆ జాతినే మొలిపించును. ఆ జాతిలో ఎట్టి మార్పు ఉండదు. మనము దేవునియొక్క ఆలోచనలలో యున్నాము. ఆ తరువాత శరీరమందు వ్యక్తపరచబడినాము. ఆయన స్వరమును విను ఒక దినము రావలసియుండెను. (వాక్యము) ఆ స్వరమును వినుటద్వారా మనము మన తండ్రియొక్క ఉనికిని గ్రహించి యున్నాము. మనము దేవునియొక్క కుమారులమని గ్రహించియున్నాము. ఆయన స్వరమును మనము వింటిమి. ఆ తప్పిపోయిన కుమారునివలె మనమును ఇట్లు కేక వేసితిమి, "ఓ నా తండ్రీ, నీ యొద్దకు నేను తిరిగి వచ్చుచున్నాను. రక్షించుము."

దేవునియొక్క కుమారుడు తాను దేవుని కుమారుడనని గుర్తించుటకు చాలా కాలము పట్టవచ్చును. వాస్తవానికి చాలామంది నిజ క్రైస్తవులు ఆ చిన్న పక్షిరాజు కథలో యుండిన రీతిగానే యున్నారు. చిన్న పక్షిరాజు పిల్ల ఒక కోడి పెట్ట క్రింద పొదుగబడెను. ఆ పక్షిరాజు ఒక నిజ విశ్వాసికి సాదృశ్యముగా యున్నట్లుగా మీరెరుగుదురు. సరి ఒక వ్యవసాయదారుడు పక్షిరాజు గూడులో నుండి ఒక గ్రుడ్డును తీసికొని దానిని కోడిపెట్ట క్రింద పొదిగించెను. ఆ తగిన కాలములో ఆ పెట్ట క్రిందగల గుడ్లు అన్నీ పొదుగబడెను. ఆ తల్లి పెట్టతో కూడా ఆ చిన్న కోడి పిల్లలు చక్కగా తిరుగుచున్నవి. కాని ఆ చిన్న పక్షి రాజుకు కోడి పెట్టయొక్క కూత అర్థము కాలేదు. ఆ పెంట పోగును త్రవ్వి ఆహారము తినుట చేత కాలేదు. ఏదో లాగున ప్రాణమును నిలబెట్టుకొన్నది గాని ఇదంతా దానికి ఏదో గందరగోళముగా కనిపించెను. ఒక దినమున ఎక్కడో ఆకాశములో ఆ తల్లి పక్షిరాజు దీనిని పసిగట్టినది. తాను పెట్టిన గ్రుడ్డు పొదుగబడి చిన్న పక్షిరాజు పిల్ల బయటకు కనిపెట్టినది. క్రింద అది తిరుగు చున్నది. అది మహా వేగముతో క్రిందికి దిగి వచ్చినది. తన స్వరమంతటితో కేక వేసినది. తన తల్లిని కలిసికొనుటకు రమ్మను కేకను ఆ పక్షిరాజు పిల్ల వినినది. అంతకు ముందెన్నడూ అది పక్షిరాజుయొక్క స్వరమును వినలేదు. కాని మొదటిసారిగా ఆ పిలుపును వినగానే దానిలో ఏదో చలనము కలిగినది. అది ఆ తల్లివైపు ఆకర్షించ బడినది. అయినా అది ప్రయత్నించుటకు భయపడినది. తనకు భయము వేయు చున్నదని ఇది మరల జవాబు ఇచ్చినది. ప్రయత్నము చేయమని మరల ఒక్కసారి అది కేక వేసినది. తన రెక్కలను విదిల్చినది. గాలిలోనికి తన్ను విసరుకొనినది. తన తల్లి పిలుపునకు జవాబును ఇచ్చినది. నీలాకాశములోనికి ఎగిరిపోయినది. చూడండి.

అది ఎప్పుడునూ పక్షిరాజే. కొంతకాలము పాటు అది ఒక కోడిపిల్లవలె నటించినది. కాని అందువలన తృప్తి కలుగలేదు. అయితే ఆ గొప్ప పక్షిరాజుయొక్క కేకను వినగానే ఆ పక్షిరాజు పిల్ల తన స్థానమునకు వచ్చినది. దేవునియొక్క నిజమగు కుమారుడు ఒక్కసారి గాని వాక్యముద్వారా ఆత్మయొక్క స్వరమును వినినయెడల తానెవరో గుర్తించి ఆ గొప్ప ప్రవక్తయగు పక్షిరాజు యొద్దకు పరుగెత్తును. ఆయనతో కూడా సదాకాలము ఉండును. క్రీస్తు యేసుతో కూడా పరలోక స్థలములందు కూర్చొనును.

పరిశుద్ధాత్మయొక్క బాప్తిస్మముతో ఇప్పుడు మన జయశాలియగు మూల రాయి వచ్చుచున్నది. గలతీ 4:4-7. అయితే కాలము పరిపూర్ణమైనప్పుడు దేవుడు తన కుమారుని పంపెను. ఆయన స్త్రీయందు పుట్టి మనము దత్త పుత్రులము కావలెనని ధర్మ శాస్త్రమునకు లోబడియున్న వారిని విమోచించుటకై ధర్మశాస్త్రమునకు లోబడిన వాడాయెను. మరియు మీరు కుమారులైయున్నందున - నాయనా తండ్రీ, అని మొరపెట్టు తన కుమారుని ఆత్మను దేవుడు మన హృదయములలోనికి పంపెను. కాబట్టి నీవిక దాసుడవు కావు కుమారుడవే. కుమారుడవైతే దేవునిద్వారా వారసుడవు. అక్కడే యున్నది. యేసు క్రీస్తు వచ్చెను. సిలువ మీద చనిపోయెను. విమోచనను పూర్తిచేసెను. (కొనుట ద్వారా లేదా వెల చెల్లించుట ద్వారా అసలు యజమానికి తిరిగి ఇచ్చుట) ఆ విధముగా ఆయన మనలను కుమారులను స్థానములో నుంచెను. మనలను ఆయన కుమారులుగా చేయుట అనగా మనము ఇంతకు ముందు కుమారులుగా లేమని కాదు. ముందే మనము ఆయన కుమారులము. కాని ఇప్పుడాయన ఆ కుమారుల స్థానములో మనలనుంచెను. ఈ లోకములో లోక రీతిగా మనము ఉన్నంత కాలము, శరీరములో యున్నంత కాలము, ఆయన కుమారులముగా మనము గుర్తించబడము. అపవాది ద్వారా మనము చెరపట్ట బడినాము. ఏమయినా గాని మనము కుమారులమే. దీనిని వినండి. **మీరు కుమారులు గనుక, మీ హృదయములలోనికి ఆయన తన కుమారుని ఆత్మను పంపెను. దానిద్వారా మీరు తండ్రీ, తండ్రీ అని మొరపెట్టుచున్నారు.** పెంతెకోస్తుయొద్ద ఆత్మ ఎవరి మీద దిగినది? కుమారుల మీద. కొరింథిలో ఎవరి మీద దిగినది? కుమారుల మీదనే. వారు వాక్యమును వినుచుండగా.

పరిశుద్ధాత్మ బాప్తిస్మమనగా ఏమిటి? క్రీస్తుయొక్క శరీరములోనికి ఆత్మ నీకు బాప్తిస్మము ఇచ్చును. అదియే నూతన జన్మ. దేవునియొక్క ఆత్మ వచ్చి నిన్ను

నింపును. నీవు మారుమనస్సు పొందిన తరువాత, (ఆయన వాక్యమును వినిన తరువాత) నీటిలో బాప్తిస్మము పొందుదువు. దేవునియెడల నిర్మలమైన మనస్సాక్షి కలిగియుండుటకు ఇది ప్రత్యుత్తరముగా యున్నది.

ఇప్పుడు మనము చూపించినది అందరునూ అర్ధము చేసికొనుటకు చాలా సులువుగా యున్నది. అందరునూ దేవత్వముయొక్క ఏకత్వము గూర్చి, ఆ బోధను గూర్చి విశ్వాసించవలెను. ఆ దేవత్వములో ముగ్గురు వ్యక్తులు లేరు గాని ఆయన ఒక్కరే. ఆ విధముగా మనము యేసుయొక్క జీవపు ఆత్మలోనికి వచ్చుట ద్వారా ఆత్మ ద్వారా తిరిగి జన్మించలేదు గాని, యేసుయొక్క జీవము మనలోనికి వచ్చియున్నది. మరటు పిదప మనకు శక్తి నిచ్చుటకు పరిశుద్ధాత్మలోనికి వచ్చుచున్నది. అది గనుక నిజమైనయెడల మనయొక్క పూర్తి రక్షణలో ఆయనకు ఒక భాగమునియ్యక మనమేల తండ్రిని అగౌరపరచుచున్నాము, ఏలయనగా రక్షణ గనుగ దేవునిదైన యెడల మరియు ముగ్గురు దేవుళ్ళున్నయెడల పిదప **ఆయన** (తండ్రి) కూడా ఏదైనను చేయవలసి యున్నది. అయితే నిశ్చయముగా ఆయనే మరియు ఆయన ఒక్కడే దేవుడనియు మరియు ఆయన మరి ఆయనొక్కడే విశ్వాసిలోనికి వచ్చుచున్నాడనియు యేసు దీనిని స్పష్టపరచుటను చూడవచ్చును. యోహాను 14:16లో చెప్పబడినదేమనగా తండ్రి మరియొక ఆదరణకర్తను పంపించును. కాని 17 వచనములో ఆయన (యేసు) వారితో నివాసము చేయుననియు, ఆ తరువాత వారిలో ఉందుననియు చెప్పెను. ఆయన వారియొద్దకు వచ్చునని 18వ వచనములో యున్నది. 23వ వచనములో ఆయన శిష్యులతో మాట్లాడుచూ ఇట్లు చెప్పెను. "మేము (తండ్రి మరియు కుమారుడు) అతని యొద్దకు వచ్చెదము." ఆ విధముగా తండ్రి, కుమారుడు మరియు పరిశుద్ధాత్మ ఒకేసారి వచ్చుచూ యున్నారు. దేవత్వములో ఒకేఒక వ్యక్తి యున్నాడు. ఆ రాకడ పెంతెకోస్తుయొద్ద జరిగెను. ఆత్మయొక్క రాకడలు రెండు లేవుగాని ఒక్కటే. ప్రజలకు నిజమగు సత్యము తెలియదు. ఇక్కడే సమస్య వచ్చుచున్నది. పాపక్షమాపణ నిమిత్తము వారు యేసును మామూలుగా నమ్ముచుందురు. కాని పరిశుద్ధాత్మను పొందుటకు రారు.

ఈ అంశమును నేను ముగించు ముందుగా మీ మనస్సులోయున్న ఒక ప్రశ్నను నేనెరుగుదునని చెప్పుచున్నాను. ముందు ఉనికి బోధను నేను నమ్ముచున్నానేమో మీరు తెలిసికొనగోరుచున్నారు. మార్మనులయొక్క ఆ ముందు ఉనికి సిద్ధాంతమును నేను నమ్ముటలేదు. నేనట్లు నమ్మినయెడల అవతారము లేదా ఆత్మయొక్క పునర్జన్మలను

గూర్చి నమ్మినట్లుగా అది యుండును. దీనిని మీరు జాగ్రత్తగాయుండి చూడుడి. దేవునియొద్దనుండి నిత్యముగా నిర్ణయించబడి వచ్చువాడు వ్యక్తి కాదు గాని వాక్యము లేదా విత్తనము. అదియే. మానవ మనస్సు గ్రహింపజాలని ఆ వెనుకకు వెళ్ళి చూచినప్పుడు దేవుడు నిత్యుడైయుండి నిత్య ఆలోచనలను కలిగియుండెను. నిత్యమగు ఆజ్ఞను జారీచేసెను. **"యాకోబును నేను ప్రేమించితిని. ఏశావును నేను ద్వేషించితిని."** (రోమా 9:13) అప్పటికి వారిద్దరు పుట్టలేదు. వారిద్దరూ ఏ మేలుగాని కీడుగాని చేయలేదు చూడండి. అది ఒక ఆలోచనగా యుండెను. ఆ తరువాత ఆలోచన వ్యక్తపరచబడెను. దేవుడు యాకోబును తిరిగి కొనెను. ఎందుకనగా యాకోబు మాత్రమే విత్తనము. ఆ కారణము చేతనే అతనికి జ్యేష్టత్వపు హక్కు దేవునితో నిబంధన విలువైనదని చూచెను. నీవు నిజమగు విత్తనమైనచో నీవు ఆ వాక్యమును విందువు. ఆత్మ నిన్ను క్రీస్తుయొక్క శరీరములోనికి బాప్తిస్మమిచ్చును. నిన్ను నింపి నీకు శక్తి ననుగ్రహించును. నీ కాలమునకు మరియు నీ దినమునకు చెందిన వాక్యమును విని చేర్చుకొందువు. నీకు వాక్యము బయలుపరచబడినపుడు ఆ నిజమగు రుజువు ఎంత స్పష్టముగా యుండునో గ్రహించుము. యేసు రాజ సంతానమై యున్నాడని గమనించుము. ఆయన మానవశరీములో జీవించెను. ఆత్మ అతనిని పిలిచినప్పుడు (వాక్యము – బయలుపరచబడిన ఆలోచన) యోర్దాను నదికి వెళ్ళి నీటిలో బాప్తిస్మము పొందెను. వాక్యమునకు విధేయత చూపినందున పరిశుద్ధాత్మ ఆయన మీదికి దిగి వచ్చెను. ఆ స్వరము ఇట్లనెను, "ఈయన నా ప్రియ కుమారుడు. ఈయన మాట వినుడి." అంతేగాని ఈయన నా కుమారుడాయెను అని ఆ స్వరము చెప్పలేదు. యేసే కుమారుడై యుండెను. అందరికి మునుపు పరిశుద్ధాత్మ ఆయనను ఆ స్థానములో నుంచెను. ఆ విధముగా ఆయన నింపబడెను. (పెంతెకోస్తు యొద్దను, ఆ తరువాత ఎన్నడయినా గాని అదే మాదిరి) ఆయన శక్తిని ప్రదర్శించుచూ వెళ్ళెను. దేవునియొక్క ప్రత్యక్షతను, ఆ దినమునకు దేవునియొద్దనుండి సంపూర్తిగా పొందెను.

తాను జీవించుచున్న కాలమునకు చెందిన వాక్యమును విశ్వాసి చేర్చుకొనుటయే పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందినట్లుగా సూచన అని నిరంతరము మేము చెప్పుకొనుచున్నాము. దానిని అతి స్పష్టముగా మీకు చూపించెదను.

ప్రకటన 2 & 3 అధ్యాయములలో ఏడు కాలములను చూతుము. అన్యుల కాలముయొక్క పూర్తి వ్యవధికి అది వర్తించును. అన్యులను రక్షణలోనికి నడిపించుటకు

దేవుడు వాడుకొనిన పూర్తి సమయము అది. ప్రతి సంఘ కాలములోను, ఎట్టి మినహాయింపు లేకుండా ప్రారంభములోను మరియు చివరలోను ఆ వర్తమానము ఇట్లున్నది: "సంఘపు దూతకు ఈలాగు వ్రాయుము (ఎఫెసు, స్ముర్న, పెర్గమ, తుయతైర, సార్దీసు, ఫిలదెల్ఫియ, లవొదికయ) ఈ సంగతులు చెప్పువాడు, మొదలగు దానితో మొదలగును. ఆత్మ సంఘములతో చెప్పుచున్న మాటను చెవిగలవాడు వినును గాక. (ఏక వచనము) ఇక్కడ గమనించండి. యేసు **(ఆత్మ ద్వారా)** ప్రతియొక్క కాలములోను ఆ కాలమునకైన వాక్య సంబంధియగు **ఒకేఒక వ్యక్తితో** పలుకును. ప్రతి కాలములోను **ఒకే ఒక** వర్తమానికుడు ఆ కాలమునకై ఆత్మ ఏమి చెప్పునో దానిని గ్రహించును మరి ఆ **ఒక్క వర్తమానికుడు** నిజమైన సంఘమునకు వర్తమానికుడు. అతడు ప్రత్యక్షతను పొంది దేవుని పక్షముగా సంఘములతో మాట్లాడును. నిజ సంఘము, అబద్ధ సంఘము రెండింటితోను అతడు మాట్లాడును. వర్తమానము అందరికిని ప్రసారము చేయబడును. వర్తమానముయొక్క పరిధిలోనికి వచ్చుచున్న వారందరికిని అది ప్రసారము చేయబడినా గాని వర్తమానమును వ్యక్తిగతముగా మాత్రమే చేర్చుకొందురు. ఆ గుంపు ఒక ప్రత్యేకమైనదిగా యుండి ఒక అర్హతను పొందిన గుంపుగా యుండును. ఆ గుంపులో ఉన్న ప్రతి వ్యక్తియు వర్తమానికుని ద్వారా ఆత్మ చెప్పుచున్నదానిని వినగల సామర్థ్యమును కలిగియుందురు. దానిని వినువారు వారియొక్క స్వయమైన వ్యక్తిగత బయలుపాటును పొందలేదు లేక ఒక గుంపు వారియొక్క ఉమ్మడి ప్రత్యక్షతను పొందుచుండుట కాదు. **అయితే దేవునియొద్దనుండి అదివరకే పొందినదానిని ప్రతియొక్క వ్యక్తి వినుచు మరియు అంగీకరించుచున్నాడు.**

ఇది ఏదో వింతగా యున్నదని మీరు తలంచరాదు. దేవునియొక్క హస్తము ద్వారా పౌలు ఈ మాదిరిని స్థాపించెను. తన దినమునకు చెందిన పూర్తి ప్రత్యక్షతను పౌలు మాత్రమే కలిగియుండెను. అతడు ఇతర అపొస్తలులను కలిసికొనినపుడు ఇది నిరూపణ అయినదని గమనించగలము. ఆ దినమున అన్యులకు పౌలు ప్రవక్త వర్తమానికునిగా యున్నాడని ఇతర అపొస్తలులును అంగీకరించిరి. వాక్యములో ఉన్న వాస్తవ ఉదాహరణను కూడా గమనించండి. పౌలు ఆసియాకు వెళ్ళగోరెను. దేవుడతనిని వద్దనెను. ఎందుకనగా మాసిడోనియాలో గొర్రెలున్నవి. (ఆయన పిల్లలు) ఆత్మద్వారా పౌలు చెప్పనైయున్న సంగతులను వారు విందురు. (మాసిడోనియా వారు) ఆసియాలోని ప్రజలు వినరు.

ప్రతి కాలములోను మనకు అదే మాదిరి యున్నది. ఆ కారణము చేతనే ఒక దేవుడిచ్చిన వర్తమానికుని ద్వారా ఒక ప్రత్యేక స్థలములో వెలుగు ప్రకాశించు చున్నది. ఆ వర్తమానికుని ద్వారా ఆ వెలుగు అక్కడ నుండి ఇతర సేవకుల పరిచర్య ద్వారా వెదజల్లబడుచున్నది. వారు నమ్మకముగా నేర్చుకొనిన వారు. అయితే బయటకు వెళ్ళు వారందరూ ఆ వర్తమానికుడు చెప్పినదానిని చెప్పినట్టుగా చెప్పుటకు నేర్చుకొనలేదు. (గుర్తుంచుకొనండి. తాను చెప్పినదానిని చెప్పవలెనని పౌలు జనులను హెచ్చరించెను. I కొరింథీ 14:37. "ఎవడైనను తాను ప్రవక్తననియైనను ఆత్మ సంబంధిననియైనను తలంచుకొనినయెడల నేను మీకు వ్రాయుచున్నవి ప్రభువుయొక్క ఆజ్ఞలని అతడు దృఢముగా తెలిసికొనవలెను." ఏమిటి? మీలోనుండి దేవునియొక్క వాక్యము వచ్చెనా? లేక మీకు మాత్రమే వచ్చెనా?") వారు దానికి ఏదయినా చేర్చినా లేక దానిలోనుండి ఏదయినా తీసివేసినా ఆ వర్తమానము ఖచ్చితమైనదిగా యుండదు. ఉజ్జీవము చనిపోవును. ఆయన స్వరమును మనము ఎంతో జాగ్రత్తగా వినవలెను. ఎందుకనగా ఆత్మకు ఒకేఒక స్వరమున్నది. అది దేవునియొక్క స్వరము. తాను చెప్పినదానిని చెప్పమని పౌలు వారిని హెచ్చరించెను. పేతురు సహితము ఆ ప్రకారముగానే చేసెను. ప్రత్యక్షత ద్వారా తనకు అనుగ్రహించబడిన దానిలో ఒక్క మాటను కూడా మార్చజాలవని (పౌలు) చెప్పెను. అందుకు వారిని హెచ్చరించెను. ఆయనయొక్క వర్తమానికుల ద్వారా దేవుని స్వరమును వినుట ఎంత ప్రధానము! వారికిచ్చినదానిని సంఘములకు చెప్పవలసి యున్నారు.

దానిని ఇప్పుడు మీరు చూడనారంభించుచున్నారని నమ్ముచున్నాను. మౌలికవాదులతోను మరియు పెంతెకోస్తువారితోను నేనెందుకు అంగీకరించుటలేదో బహుశా మీరు అర్థము చేసికొనియుందురు. ప్రభువు నాకు ఏ విధంగా బయలుపరచెనో అలాగే నేను వాక్యమును పట్టుకొనియుండవలసి యున్నాను. ఇప్పుడు దానినంతటినీ నేను చెప్పలేను. చెప్పినచో మరో పుస్తకము తయారగును. కాని ప్రభువుయొక్క సహాయమును బట్టి మనము చాలా ప్రసంగములను మరియు టేపులను మరియు వర్తమానములను ఈ అంశములన్నిటిపై మనకు సహాయపడుటకును మరియు గ్రహించుటకును లేఖనములను వివరించి చెప్పుటకు కలిగియున్నాము.

"ప్రతి కాలములోను ఆత్మ సంఘములతో చెప్పుచున్న మాటను చెవిగలవాడు వినును గాక!" ప్రతి కాలములోను కేక ఒక్కటే. ఆత్మ చెప్పుచున్నదానిని వినండి.

మీరు క్రైస్తవులయినచో ఆత్మ బోధించుచున్న వానివైపుకు మీరు తిరిగెదరు. అది ఈ కాలపు వాక్యము. ప్రతి కాలమునకు చెందిన ప్రతి వర్తమానికుడును అదే వాక్యమును బోధించును. ప్రతి నూతనమగు మరియు నిజమగు ఉజ్జీవమును ఆ కాలపు ప్రజలను ఆ దినపు వాక్యముయొద్దకు త్రిప్పును. ప్రతి కాలములోని కేకకూడా ఒక గద్దింపుగానే యుండును. "నీవు దేవుని మాటను విడిచిపెట్టి యున్నావు. మీరు మారు మనస్సుపొంది వాక్యము నొద్దకు తిరిగి రమ్ము!" బైబిలులోని మొదటి గ్రంథము (ఆది కాండము) మొదలుకొని, చివరి గ్రంథము వరకు (ప్రకటన) దేవుడు సంతోషము వెల్లడిచేయక పోవుటకు ఒకేఒక కారణమున్నది – వాక్యమును విడిచిపెట్టినందువలననే. ఆయన యొక్క కృపను పొందుటకు ఒకేఒక విరుగుడు యున్నది. – వాక్యము నొద్దకు తిరిగి వచ్చుటయే.

ఎఫెసు కాలములోను, ఈ కాలములోను, ప్రతి కాలములోను ఇది సత్యమని మనము చూడనుద్దేశించియున్నాము. ఈ చివరి కాలమగు మన కాలములో వాక్యము యొక్క విసర్జనను మనము చూడగలము. పూర్తి విశ్వాస భ్రష్టత్వము. మహా శ్రమలో ఇది పరిసమాప్తమగును.

మీరు నిజ సంతానమయినచో, మీరు నిజముగా పరిశుద్ధాత్మతో బాప్తిస్మము పొందినచో, ఆయన వాక్యమును మీ అవసరమగు ఆహారముకంటె ఎక్కువగా ఎంచి, దేవుని నోటనుండి వచ్చు ప్రతి మాట వలనను జీవించుటకు ఆరాటపడెదవు.

మనందరి కొరకు నేను చేయు ఆసక్తిగల ప్రార్థన ఇదే: ఈనాడు మనకొరకు ఆత్మ, వాక్యమునుండి తీసికొని వచ్చుచున్నదానిని మనము విందుము గాక!

**S. దానియేల్ సంపత్ కుమార్**
**డోర్ నెం: 147, తిరునిలై కాలని,**
**విచూర్ పోస్ట్, చెన్నై-600103**




*for books contact :*

**S.DANIEL SAMPATH KUMAR**
*No. 147, Thirunilai colony ,*
*vichoor post , chennai - 600 103*
*E-Mail : sdanielsampathkumar@gmail.com*
*Website : danielendtimebooksministry.org*
*Phone No :* 99419 74213 , 96001 71260